క్లుప్తంగా

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

త్రిపురారం: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్)ను రెగ్యులరైజ్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు ఉపేందర్, అజ్మత్, శ్యాంసుందర్ రెడ్డి, సతీష్, శంకర్, నరేందర్, మంగ, మమత, భిక్షం, మదన్‌మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు పంపిణీ చేయాలని కలెక్టర్‌కు వినతి

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని గ్రామానికి చెందిన అడ్వకేట్ నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం నల్లగొండలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించినప్పటికీ ఇప్పటివరకు పేదలకు పంపిణీ చేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలన్నారు.

రేపు హజ్ యాత్రికులకు రక్త పరీక్షలు

మిర్యాలగూడ: హజ్ యాత్రకు వెళ్లనున్న యాత్రికులకు శుక్రవారం పట్టణంలోని బంగారుగడ్డ ఆస్పత్రిలో రక్త పరీక్షలు చేయనున్నట్లు మిర్యాలగూడ డివిజన్ హజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అర్షద్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన హజ్ యాత్రికులు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డుతో హాజరై ఈసీజీతో పాటు రక్త పరీక్షలు చేయించుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

బొడ్రాయి వార్షికోత్సవాలు



దుర్గామాత ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

మాడుగులపల్లి: మండలంలోని పాములపహాడు గ్రామంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం బొడ్రాయి వద్ద వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బొడ్రాయికి జలాభిషేకం, కొబ్బరి నీళ్లు, పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి దుర్గామాత ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాతం లక్ష్మమ్మ, ఎంపీటీసీ కళింగరెడ్డి, మాజీ సర్పంచులు కుర్రి దాసయ్య, చింతచర్ల జానయ్య, పాలిశెట్టి ఉపేంద్ర, తోట సత్తిరెడ్డి, సామాజిక కార్యకర్త వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

గుర్రంపోడు: గౌడ సంఘం గుర్రంపోడు మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలోని క్రాంతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన గౌడ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కుప్ప రాములుగౌడ్, వడ్డగోని యాదగిరిగౌడ్, కుంభం యాదయ్య, ఐతగోని రామచంద్రంగౌడ్, అధ్యక్షుడిగా ఐతగోని వెంకటేశంగౌడ్, ఉపాధ్యక్షులుగా మందాడి సైదులు, పామనగుండ్ల లాలయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా రావుల సైదులుగౌడ్, సహాయ కార్యదర్శిగా పందుల మల్లయ్య, కోశాధికారిగా కొండ నర్సింహ, కార్యవర్గ సభ్యులుగా పామనగుండ్ల వెంకన్న, ఐతగోని కొండయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్య, మండల నాయకులు ఎరుకల రామలింగం, బల్గూరి నగేష్‌గౌడ్, రావుల వెంకటనారాయణగౌడ్, బోయపల్లి సైదులుగౌడ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

చందంపేట: మండలంలోని యాపలపాయతండాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ సుశీలాశంకర్‌నాయక్ ప్రారంభించారు. గ్రామంలో సుమారు 140 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 80 మందికి కంటి అద్దాలు అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చందునాయక్, శ్యామ్, జహీర్, దేవుజానాయక్, కల్యాణ్‌నాయక్, అంజయ్య, లక్ష్మమ్మ, రావుల శ్రీనివాస్, నర్సయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

నందికొండలో తాగునీటి కటకట

- రెండు మూడు రోజులకోసారి నీటి సరఫరా
- అమలుకాని మిషన్ భగీరథ పథకం

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీలవాసులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులకోసారి కులాయిల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నారని, ఒక్కోసారి పంపింగ్ చేసే మోటార్లు చెడిపోతే వారం రోజుల వరకు కూడా నీరు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. నందికొండ మున్సిపాలిటీలో బోరు బావులు, సొంత బోర్లు ఉండవు. కేవలం నీటి కులాయిల ద్వారానే తాగునీరు సరఫరా అవుతుంది. తాగడానికి, ఇతర వినియోగానికి ఈ నీటిమీదనే స్థానికులు ఆధారపడాల్సి వస్తుంది.

రూ.20కోట్లు ఖర్చు చేసినా..

తాగునీటి సరఫరా కోసం ఎన్‌ఎస్‌పీ అధికారులు పదిహేనేళ్ల క్రితం సుమారు రూ.20కోట్లు ఖర్చు చేసి సాగర్ డ్యాం దిగువన పంప్ హౌజ్ నిర్మించి హిల్ కాలనీ, పైలాన్‌కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అప్పటి నుంచైనా హిల్‌కాలనీలో నిత్యం నీరిచ్చిన దాఖలాలు లేవు. ఇక్కడి నుంచి 150కిలోమీటర్ల దూరాన గల హైదరాబాద్ వాసులకు మాత్రం నిత్యం నీరందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అదనపు మోటారు లేక ఇబ్బందులు

ఒక మోటరు కాలిపోతే వెంటనే మరో మోటారుతో నీటిని పంపు చేసేందుకు అదనపు మోటారు లేదు. నిధుల కొరత ఉన్నందున మోటర్ పంప్‌సెట్ కొనుగోలు చేయలేకపోతున్నామని అధికారులు తెలిపారు. నీటి సరఫరాను మున్సిపాలిటీకి అప్పగిస్తామన్నా వారు తీసుకోవడం లేరని ఎన్‌ఎస్‌పీ అధికారులు పేర్కొంటున్నారు.



పైలాన్ కాలనీలోని తాగునీటి శుద్ధి ప్లాంట్

మిషన్ భగీరథ పథకం లేనట్టేనా?

తెలంగాణలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా తండాలు, మారుమూలగ్రామాలకు సైతం ఇంటింటికి కుళాయి బిగించి నిత్యం తాగు నీరందిస్తున్నారు. కానీ నందికొండ మున్సిపాలిటీలో ఈ పథకం అమలు చేయకపోగా, రెండు, మూడు రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఆయా కాలనీల్లో నాలుగైదు ఇళ్లకు ఒక కుళాయి మాత్రమే ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో నీళ్ల కోసం పనికి పోకుండా మహిళలు, పాఠశాలకు పోకుండా పిల్లలు ఇళ్ల వద్దనే ఉండి నీళ్లు పట్టి వెళ్తుండడం గమనార్హం. సాగర్ కాలనీలు గుట్టల ప్రాంతం కావడంతో బోర్లు, బావులు ఏర్పాటు చేసేందుకు వీలులేదు.

గేట్ వాల్స్ ఏర్పాటు చేస్తే మెరుగవుతుంది..

కాలనీలకు వెళ్లే పైపులకు అవసరమైన చోట గేట్ వాల్స్ బిగిస్తే సమస్య కొంతవరకు మెరుగవుతుంది. సాగర్ కాలనీలు గుట్టలపైనే నిర్మించినందున ఎత్తు పల్లాలు 10 నుంచి 15 మీటర్ల మేర ఉంది. పైపులలోకి నీరు వదలగానే దిగువకు నీరు పరుగెత్తుతోంది. కింది ప్రాంతం వారికి వద్దన్నా నీరు వెలుతోంది. పైన ఉన్నవారికి మోటర్లు పెట్టి తోడినా నీరు రావడం లేదు. అందుకే ముందుగా అధికారులు స్పందించి అన్ని ప్రాంతాల్లో గేట్‌వాల్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కుళాయిలు బిగించాలి



నందికొండ మున్సిపాలిటీలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలి. నిత్యం నీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 30వేలమంది కాలనీలలో ఉన్నప్పుడు రోజుకు రెండు సార్లు నీటిని సరఫరా చేసేవారు. అప్పుడున్నంత మంది జనాభా నేడు లేరు. అయినా నీటిని అందించడం లేదు.

– శివ, స్థానిక వ్యాపారి

ప్రతిపాదనలు పంపాం

ఇంటింటికి కుళాయి కనెక్షన్ నిత్యం నీటిని సరఫరా చేసేందుకు రూ.43కోట్లతో అమృత్-2 పథకం కింద ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి ఆమోదం వస్తే టెండర్లు పిలిచి హిల్‌కాలనీలో జలాశయం తీరానే తాగు నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేసి నిత్యం నీరందిస్తాం.

– రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ధాన్యం కొనుగోళ్లపై ప్రకటనలకే పరిమితం



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న లాలునాయక్

చందంపేట: రైతు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని, తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. బుధవారం చందంపేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడి వారిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని సేకరించడం కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. అకాల వర్షాలతో తడిని ధాన్యం మొలకలు వచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొమ్ము వెంకటయ్య, మండల అధ్యక్షుడు పాత్లావత్ ఆంజనేయులు, కేతావత్ బహదూర్‌నాయక్, నాయకులు శ్రీశైలంయాదవ్, కొమ్ము వెంకటయ్య, భూతం వాసుదవ్, నాగిళ్ల అంజి, బోడ రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన ఎమ్మెల్యే భగత్



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా: హాలియా మున్సిపాలిటీ కేంద్రంలో షాదీఖానా ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ హైదరాబాద్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. హాలియా మున్సిపాలిటీ కేంద్రంలో షాదీఖానా లేకపోవడంతో ఆర్థిక స్తోమత లేని నిరుపేద ముస్లిం కుటుంబాలు తమ ఆడబిడ్డల వివాహాలు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. షాదీఖానా ఏర్పాటుకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

దేవరకొండ: దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన రీయూజ్, రెడ్యూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాత బట్టలు, పాత పుస్తకాలు, పాత చెప్పులు, ప్లాస్టిక్ వస్తువులను వార్డుల్లో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లలో అందించాలని కోరారు. ఈ నెల 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 5వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. పట్టణంలో పరిశుభ్రత ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ జగమంతు, వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది ఉన్నారు.



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

27 నుంచి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు



శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయం

హాలియా: అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో గల శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాలను ఈ నెల 27 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కందుల నారాయణరెడ్డి, కందుల రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 27 నుంచి 30వ తేదీ వరకు స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజ, హోమాలు వంటివి నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పబ్బతి ఆంజనేయస్వామి శోభయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి పాటుపడాలి



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు

హాలియా: హాలియా వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు పాటుపడాలని మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మార్కెట్ కార్యవర్గం పని చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి చేపట్టాల్సిన పలు కార్యక్రమాలపై చర్చించి, రూ.2.84లక్షల అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో పనిచేసే సెక్యూరిటీ గార్డు నడ్డి లింగమ్మ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆడెపు రామలింగయ్య, హాలియా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, పెద్దవూర సొసైటీ చైర్మన్ గుంటక వెంకట్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు సురభి రాంబాబు, ఉడ్తూరి శ్రీనివాస్‌రెడ్డి, హరిసింగ్, మస్తాన్ అలీ, హరికృష్ణయాదవ్, రాజేష్‌నాయక్, పాదిల శ్రీనివాస్, ముప్పరపు శేఖర్, మార్కెట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులతో అసౌకర్యం కల్గిస్తున్నారు



ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న శాఖాపురం గ్రామస్తులు

నిడమనూరు: రోడ్డు పనుల పేరుతో మూడు నెలలుగా ప్రజా రాకపోకలకు అసౌకర్యం కల్గిస్తున్నారని మండలంలోని శాఖాపురం గ్రామస్తులు బుధవారం ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాఖాపురం గ్రామంలో గత మూడు నెలలుగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని, దీంతో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ దెబ్బతిందని, దానిని ఇప్పటివరకు బాగు చేయకపోవడంతో గ్రామస్తులు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డు పనులను పూర్తిచేయకపోవడంతో మరొక రహదారి మీదుగా వాహనాలను మళ్లించడంతో వాహనదారులు అవస్థలు పడుతన్నారని పేర్కొన్నారు. పనులు ఆలస్యం చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, పనులు త్వరగా పూర్తిచేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు జెరిపోతుల దేవయ్య, మోసాల శ్రీను, పోలేపల్లి ఇసాక్, గంటె కంపు వెంకటయ్య ఉన్నారు.

మూసాఅలీఖాన్‌కు ఎన్టీఆర్ కీర్తి పురస్కారం

మిర్యాలగూడ టౌన్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శిఖరం ఆర్ట్స్ థియేటర్ వారు మిర్యాలగూడ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మూసా అలీఖాన్‌కు ఎన్టీఆర్ కీర్తి పురస్కారం ప్రకటించారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల త్యాగరాయ గాన సభలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆయన ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన శిఖరం ఆర్ట్స్ థియేటర్ అధినేత శ్రీకృష్ణ గొల్లకు తదితరులకు మూసాఅలీఖాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు.



పురస్కారం అందుకుంటున్న మూసాఅలీఖాన్

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

చందంపేట: చందంపేట మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పార్వతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వేసవిలో ఆయా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేనావత్ బుజ్జి, లచ్చిరాంనాయక్, ఎంపీడీఓ రాములునాయక్, వైస్ ఎంపీపీ జాల ప్రేమలతానర్సింహారెడ్డి, తహసీల్దార్ దేవదాసు, ఎంఈఓ సామ్యనాయక్, డాక్టర్ ధనలక్ష్మి, చందునాయక్, సాధిక్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపడుతోందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ గంధం సురేష్, రమావత్ దస్రూనాయక్, వార్డు సభ్యులు ఎలిమినేటి శ్రీను, కొడిదాల వెంకటయ్య, వస్కుల శ్రీను, రమావత్ లాలునాయక్, ఎంపీడీఓ బాలరాజ్‌రెడ్డి, ఎంఈఓ మాతృనాయక్, హెచ్‌ఎం మంద సత్యనారాయణ, కొర్ర లోక్యానాయక్, సక్రు తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఫర్టిలైజర్, విత్తన డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సందీప్

పెద్దవూర: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు అమలు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి కె. సందీప్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిధిలోని ఫర్టిలైజర్, విత్తన దుకాణ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విత్తనాల కొనుగోలు రశీదులపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. రశీదుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, విక్రయదారుడి గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, విత్తన రకం పేర్లు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ సైదులు, దుకాణదారులు కర్నాటి వెంకట్‌రెడ్డి, నిమ్మల సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్, వెంకటేశ్వర్‌రెడ్డి, గోవింద్, నర్సిరెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

పూసలపహాడ్‌లో నీటి సరఫరా పునరుద్ధరణ

- వారం రోజుల్లోనే సమస్య పరిష్కారానికి చొరవ
- ఎమ్మెల్యే నోముల భగత్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు

మాడుగులపల్లి: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ ‘మన ఊరికి మన ఎమ్మెల్యే’ పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గ్రామాల్లోని సమస్యలు తెలుసుకొని వెనువెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం మాడుగులపల్లి మండలంలోని పూసలపహాడ్ గ్రామంలో పర్యటించిన ఆయనకు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, బోరు ఉన్నా దానికి మోటారు లేకపోవడంతో కొన్నాళ్లుగా నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానిక మహిళలు వివరించారు. దీంతో వారం రోజుల్లోపే బోరుకు నూతన మోటారు, స్టార్టర్ బిగించి నిడమానూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖాసీంకు పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఎమ్మెల్యే భగత్ ప్రత్యేక చొరవ చూపి నీటి సరఫరాను పునరుద్ధరించడంతో గ్రామస్తులు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



బోరు వద్ద నీటిని తీసుకెళ్లేందుకు వచ్చిన మహిళలు

ధాన్యంలో అధిక తరుగు తీస్తే చర్యలు తప్పవు



కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

చందంపేట: కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యంలో అధిక తరుగు తీస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని చందంపేట తహసీల్దార్ దేవదాసు, డీటీ సీఎస్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొంత మంది సిబ్బంది అక్రమంగా తరుగు తీస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని గుంటిపల్లి సర్పంచ్ మాధవరం శంకర్‌రావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బుధవారం మండలంలోని పోలేపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులు విచారణ చేపట్టి, రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విషయమై జిల్లా అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ ముక్తార్, సర్పంచ్ శంకర్‌రావు, సీఈఓ వేణు, రైతులు పాల్గొన్నారు.

కాలువల మరమ్మతులు సత్వరమే పూర్తి చేయాలి

మిర్యాలగూడ అర్బన్: ఎన్‌ఎస్‌పీ కాల్వల మరమ్మతు పనులను సత్వరమే పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని ములకలకాల్వ మేజర్ కాలువ మరమ్మతు పనులను ఆయన పరిశీలించిన మాట్లాడారు. పనులు ప్రారంభించి 15రోజులకు కావొస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని అన్నారు. ఇప్పుడు కాలయాపన చేసి తీరా నీరు వచ్చే సమయానికి పనులు నాసిరకంగా చేసి మమా అనిపిస్తున్నారని, దీంతో గండ్లు పడి రైతులు నష్టపోతున్నారని అన్నారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు జానపాటి శ్రీను, సతీష్, ఎర్రబోయిన చిన్నరాజు, లింగయ్య, పుల్లయ్య, వెంకన్న తదితరులున్నారు.



ములకలకాల్వ మేజర్ కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి: కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సందర్శించారు. తేమ శాతం, తాలు పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతెం కరుణాకర్, ఎర్ర వెంకటేశ్వర్లు, సైదులుగౌడ్, శ్రీరాములు, మల్లారెడ్డి, లక్ష్మణ్, శ్రీను తదితరులున్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

బీసీ యువజన సంఘం ఇన్‌చార్జిగా విజయ్



నియామకపత్రం అందుకుంటున్న విజయ్

దేవరకొండ: బీసీ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన కామోజి విజయ్ నియమితులయ్యారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సరికొండ జనార్దన్‌రాజు విజయ్‌కి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, భాస్కరాచారి, ఎస్‌ఎన్ చారి, మధు, భాస్కర్, యాదయ్య, గోపి తదితరులున్నారు.

ధాన్యం దిగుమతిలో ఇబ్బందులు

- మిల్లు నుంచి వెనక్కు వచ్చిన లారీ
- ఆందోళన చేపట్టిన రైతులు

మాడుగులపల్లి: ధాన్యం సకాలంలో దిగుమతి కాకపోడంతో కొనుగోలు కేంద్రం నుంచి వెళ్లిన లారీ తిరిగి వెనక్కు మాడుగులపల్లి కొనుగోలు కేంద్రానికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న రైతులు కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేపట్టారు. వివరాలు.. మాడుగులపల్లి కొనుగోలు కేంద్రంలో ముగ్గురు రైతులకు చెందిన 720కిపైగా ధాన్యం ఈ నెల 21న కాంటా వేసి లారీలో లోడ్ చేసి మిర్యాలగూడలోని ఓ రైస్‌మిల్లుకు తరలించారు. మూడు రోజులైనా మిల్లు వద్ద ధాన్యం దిగుమతి కాకపోవడంతో చేసేదేమీ లేక డ్రైవర్ తిరిగి లారీని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. దీంతో రైతులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీసీఓ కొనుగోలు కేంద్రానికి చేరుకొని రైతులకు సర్ది చెప్పి లారీని తిరిగి ధాన్యం దిగుమతి కోసం అదే రైస్ మిల్లుకు పంపించారు.